# దేవుడిచ్చిన వరం

వెనుకటి కొక సద్బ్రాహ్మడుండేవాడు. ఆయన నిత్య సత్యవ్రతుడు. పరమ దయాళువు. ఆకాశం విరిగి మీదపడ్డా అబద్ధం ఆయన నోటవచ్చేదికాదు. చిన్న దోమకు కూడా ఆయన ఎన్నడూ హాని తలపెట్టి ఎరగడు. అయితే దుర్భర దారిద్ర్యం ఆయన జీవితాన్ని కుంగదీసింది. బ్రతుకు ఆయనకు నరక ప్రాయమయింది. తన దారిద్ర్యం తనకే కాక సాటివారికికూడా బాధాకరంగా ఉన్న సంగతి గ్రహించినవాడై, తనను భగవంతుడే తప్ప సాటిమానవులెవరూ ఉద్ధరించలేరని గ్రహించి భగవంతుణ్ణి గురించి ఘోరతపస్సు ప్రారంభించాడు.

ఆ బ్రాహ్మడి సత్యాహింసలకు అదివరకే సంతోషించిన భగవంతుడు ఆయన ఘోర తపస్సుకు మెచ్చినవాడై ప్రత్యక్షమై "ఏం కావాలో కోరుకో" అన్నాడు; భగవంతుడి కాపాటితెలియక కాదు. భగవంతుడు బ్రాహ్మడికోరిక తీర్చాలా, వద్దా అనే సమస్యపై కైవల్యంలో హోరాహోరి చర్చలు జరిగాయి. చర్చల అనంతరం వోటింగు జరుగగా బ్రాహ్మడికి అనుకూలంగా ఏడులోకాల ప్రతినిధులూ, ప్రతికూలకగా అయిదులోకాల ప్రతినిధులూ వోటు చేశారు. రెండులోకాల ప్రతినిధులు చర్చలోగాని వోటింగులోగాని పాల్గొనక తటస్థంగా ఉండిపోయారు.... అయినా బ్రాహ్మడినోటనే పలికిద్దామని భగవంతుడు "నీకేం కావాలో కోరుకో!" అన్నాడు. అదీకాక కైవల్య రాజ్యాంగ పరిషత్తువారు కృతయుగంలో ఏర్పాటు చేసిన కాన్స్టిట్యూషను ప్రకారం భగవంతుడు ఆవిధంగా అడగవలసిన బాధ్యత కూడా లేకపోలేదు. (ఈ కథా కాలంనాటికింకా కొత్త కాన్స్టిట్యూషను కైవల్యంలో అమలులోకి రాలేదు. అది వేరే కథ. మరోసారి చెబుతాను.)

బ్రాహ్మడు భగవంతుడిమీద ఒక చిన్న దండకం చదివి "స్వామీ, నాకు వెయ్యి కోట్ల వరహాలు దయచేయించు" అన్నాడు.

అంతడబ్బుతో ఆ బ్రాహ్మడు సుఖపడడని భగవంతుడికి తెలుసు. కాని ఆ సంగతి బ్రాహ్మడితో చెప్పటానికి భగవంతుడికి హక్కులేదు. అందుచేత బ్రాహ్మడడిగిన వరం కాస్తా ఇచ్చేసి భగవంతుడు తన దారిన తాను అంతర్ధానమైనాడు.

ప్రపంచంలో ఉన్న దరిద్రమంతా తానే మోస్తూ ఉండినట్టూ ఆ భారమంతా ఒక్కసారి దిగిపోయినట్టూ అయి బ్రాహ్మడు ఏకాయెకి ఇంటికొచ్చిపడ్డాడు. బ్రాహ్మడు ఇంటికి రావటమేమిటి, నట్టింట్లో అటకవిరిగి కిందపడటమేమిటి, రెండూ ఒకేసారి జరిగాయి.

"అయ్యో ఎంత అపశకునం" అని బ్రాహ్మడి పెళ్ళాం కంటతడి పెట్టింది.

"ఓసి నీయిల్లు వరహాలుగానూ, ఊరుకోవే," అంటూ బ్రాహ్మడు అటక విరిగిపడిన కారణం అన్వేషించే సరికి సంచులు దొరికాయి. పెద్దపెద్ద గోతాలు! సీళ్ళువేసిన గోతాలు! వాటెనిండా - బ్రాహ్మడు వెంటనే ఊహించాడు వరహాలు! ఒక్కొక్క గోతంలోను లక్షేసి వరహాలు !

"మనపంట పండిందే ! మన దరిద్రం తీరిందే ! ఇదుగోనే అంతులేని ధనం ! వరహాలు ఒంటినిండా పోసుకోవే ! గుప్పెడు తీసుకుని కాకులకు గిరవాటెయ్యవే!" అని బ్రాహ్మడు వొళ్ళుతెలీకుండా పేలసాగాడు.

"ఎందుకండీ ఇన్ని వరహాలూ ? బరువుచేటూ ! నిక్షేపంలాటి అటక కాస్త విరిగి పడిపోయిందికదా —అయిదు ఊరగాయ జాడీలు పెట్టినా కదలని అటక" అన్నది బ్రాహ్మడి పెళ్ళాం.

తన భార్యకు ఈ డబ్బు విలవ ఇంకా తలకెక్కలేదని బ్రాహ్మడు గ్రహించి, "ఓసి అదేం మాట ! చూడవే మన దగ్గర వెయ్యికోట్ల వరహాలు ఉంవి. ఇంతడబ్బు రాజుగారి దగ్గర ఉందటే ? దీంతో నీయిష్టంవచ్చినంత భవంతులు నీ యిష్టంవచ్చినన్ని కట్టించవచ్చు. అప్పటికి ఈ బస్తాలలో ఒకటైనా తరగదు తెలిసిందా ? అటకకోసం ఏడవకు" అన్నాడు.

"ఎందుకన్ని ఇళ్ళు, చక్కని గుడిసె ఉండగా మనకు భవంతులెందుకండీ" అన్నది బ్రాహ్మడి భార్య.

ఆవిడకు చెప్పి లాభం లేదనుకున్నాడు బ్రాహ్మడు. ఆయన ఇళ్ళమీద ఇళ్ళు, గ్రామాలమీద గ్రామాలు కొనసాగాడు. రోజూ సంతర్పణలు చేయసాగాడు.

బ్రాహ్మడి ధనరాసులమాట చుట్టుపక్కల పొక్కిపోయింది. ఒకరోజు ఎక్కడినుంచో బందిపోటు దొంగలు వచ్చి బ్రాహ్మడి ఇంట్లోపడి పదిహేను వరహాల మూటలు మోసుకుపోయి నారు. బ్రాహ్మడు వారిని వారించబోయినాడు. కాని వాళ్ళుకత్తిదూసి బ్రాహ్మడిచేతిమీద గాటు పెట్టి "బుద్ధికలిగి ఉండకపోతే మెడమీద యింకా పెద్దగాటు పెడతా" మన్నారు.

ఒక నెల గడిచిందో లేదో ఊళ్ళో పెద్ద సభచేశారు. సభకు బ్రాహ్మణ్ణి కూడా పిలిచారు, ఆ సభలో బ్రాహ్మణ్ణి గ్రామ పెద్దలంతా తీవ్రంగా ఖండించారు. బ్రాహ్మడు ఆశ్చర్యంతో నోరుతెరచి వినసాగాడు.

ఒక పెద్ద మాట్లాడాడు, మిగిలినవారు — బ్రాహ్మడితో సహా — నిశ్శబ్దంగా ఆలకించారు.

"మన ఊరికొక గొప్పపీడ—ఒక గొప్ప విపత్తు,ఒక గొప్ప అనర్థం దాపురించింది. అదేమిటంటే మన శివయ్య కుబేరుడైనాడు. శివయ్య అంటే మనకందరికీ యిష్టం. మనం శివయ్యకూ శివయ్యకుటుంబానికీ, సదా ఎల్లప్పుడూ మనకు చాతనయిన సహాయం చేస్తూ వచ్చాం. అటువంటి శివయ్య మనకు కృతజ్ఞుడై ఉండకపోగా మన జీవితాలు దుఃఖభాజనం చేయడానికి భగవంతుని గురించి తపస్సుచేసి మానవమాత్రుడు కలలోకూడా కని వినని

ధనరాసులు సంపాదించాడు.

"పోనీ ధనరాసులు సంపాదించుకున్న శివయ్య వాటిని నిక్షిప్తం చేసుకున్నాడా అంటే అదీలేదు. ఆ ధనరాసులను జాతి కుల మత వయో వివక్షతలు లేకుండా వెదజల్లేస్తున్నాడు. ఈ ఒక్క గ్రామంలోనే శివయ్య రాజాధిరాజులుండవలసిన భవంతులు కట్టించాడు. ఈ చుట్టుపక్కల నూరుగ్రామాలలో ఇటుకగాని, పెంకుగాని సున్నంగాని మందులోకి లేకుండా పోయాయి. అథవా దొరికినా పదింతలూ, నూరింతలూ ధర చెబుతున్నారు. ఎందుకు చెప్పరూ ? శివయ్య ఇంకా నూరిళ్ళకు సామాగ్రి మాట్లాడివుంచాడు. శివయ్య ఏ ధరైనా ఇవ్వగలడు. చెప్పండి, ఈ పరిస్థితులలో గృహస్థులం ఎట్లా బతకాలి ?"

"శివయ్య రోజూ సంతర్పణలు చేస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడా ధాన్యంగింజ లేదు. అథవా ఉంటే శివయ్యతో పోటీచేసి మనం కొనలేం—"

శివయ్య ఈ అభిశంసన భరించలేకపోయినాడు. లేచి సభవారికి నమస్కారంచేసి "నేను చేసిన అపచారం ఏదన్నా ఉంటే నన్ను మీరంతా మన్నించాలి. మీ అందరికి ఇళ్ళు కట్టిపెడుతున్నాను. మీకు వేరే ఇళ్లెందుకు ? వాటిలో నేను నివసించగలనా ? మీరే నివసించండి. భగవంతుడుడిచ్చినది ఇంత ఉంది కనక నేను నిత్యమూ మీకు భోజనము పెడతాను. మీరు వేరే పొయ్యిరాజెయ్యక నేను పెట్టే భోజనం ఆరగించండి. ధాన్యం ఎంత ఖరీదుకైనా కొనటానికి నేనున్నానుగా?" అన్నాడు.

ఈ మాటకు మరో పెద్దమనిషి నిప్పులు కక్కుతూ లేచి, "నూరు ఇళ్ళలో నూరు గ్రామాలవారిని ఎట్లా నివాసం పెడతావు ? నీకేమైనా బుద్ధి ఉందా లేదా ? అదీకాక అందులో బలంగలవాళ్ళూ, హంతకులూ దౌర్జన్యం చేయగల వాళ్ళూ అదివరకే చేరారు. వందలమందికి భవంతులు కల్పించి వేలమందికి ఇటుక, రాయి, సున్నంబెడ్డా దొరకకుండా చేశావు. నీ సంతర్పణలు అఘోరించినట్టే ఉన్నాయి. రోజూ నీ పంచభక్ష్య పరమాన్నాలు తిన్నవాళ్ళు అజీర్తిచేసి వాంతులు కలిగి చస్తున్నారు. అదొక లెక్కలోదికాదు. ఈ విధంగా ఈ నూరు గ్రామాలవారూ రోజూ తినడానికి ఈ దేశంలో తిండెక్కడుంది ? మహాపెడితే ఆరునెల్లు పెడతావు ఆ తరవాత ఒక్కగింజ మిగలదు. నీ వరహాలు పొలంలో చల్లి ధాన్యం పండించవలసిందే ! ఈ ఆరునెల్లూ అయాక నీకు, నీ పెళ్ళానికి, పిల్లలకూ మెతుకుండదు. నీతోపాటు వేలకువేలు ప్రజలు తిండికి మాడిచస్తారు. ఏదో మమ్మల్ని ఉద్ధరిస్తున్నవాడల్లే చెప్పొచ్చావు!" అని అరిచాడు.

ఆయన ఇంకా పూర్తి చెయ్యక పూర్వమే మరొక పెద్దమనిషి లేచి ఈ విధంగా అన్నాడు:

"శివయ్య ఆరునెల్లమాట చెబుతున్నాడు. ఇవాళ మాటేమిటి? శివయ్య పుణ్యమా అంటూ వర్ణాశ్రమ ధర్మాలు అప్పుడే అడుగంటాయి. మంగళ్ళు పలకటంలేదు. చాకళ్ళు పలకటంలేదు. వ్యవసాయకులు కూడా ఈ ఏడు పొలాల మీద శ్రద్ధ చూపటంలేదు.

ఎందుకు చూపుతాను? వారికి రోజూ పుష్టుగా తిండి దొరుకుతున్నది. ఎవరు మాత్రం ఎందుకు పని చేయాలి? ఏ గింజలకోసం వాళ్ళు ఇదివరలో పని చేస్తూ వచ్చారో అవి వారికి పదింతలుగా లభిస్తున్నాయి కద! వర్ణాశ్రమ ధర్మాలు అడుగంటినాక ఈ సమాజానికి వినాశనం తప్పదు. ఇక్కడ చేరినవారు గడ్డాలు గీకించుకొని ఎన్నాళ్ళయింది? నామాట నమ్మండి. మనకు విలయం ఆసన్నమయింది."

శివయ్య మళ్ళీ సభకు చేతులు జోడించి, "మీరు చెప్పేటువంటి మాటలు వింటూంటే నాకు భయంగా ఉన్నది. కనుక నాకు భగవంతుడిచ్చినది యావత్తూ ప్రజలందరికీ ఈ క్షణమే పంచేస్తాను. అప్పుడు నేను కూడా అందరితోనూ సమానుడ్ని అవుతాను. ఎవరికీ దరిద్రం వుండదు" అన్నాడు.

సభలో కొందరు తొందరపడి హర్షధ్వానాలు చేశారు కాని, "వల్లకాదు! ఎంతమాత్రమూ వల్లకాదు" అంటూ ఒక గడ్డం మనిషి లేచి నిలబడ్డాడు. మళ్ళీ సభ నిశ్శబ్దమయింది.

"శివయ్య దగ్గర ధనరాసు లుండడం కంటె కూడా విలయహేతు వేదన్నావుంటే అది అందరి ఆర్థిక దరిద్రమూ తీరడమే! ఏమంటారా? వివిధ వృత్తులు చేసుకొనేవారు దరిద్రంలో వుండబట్టే సంఘం నడుస్తోంది. చాకళ్ళూ, మంగళ్లూ, సాలీలూ, కుమ్మరులూ, వడ్రంగులూ, మొదలైనన వృత్తులవారు బ్రాహ్మలు మొదలైన వారితో సమానం అయితే సంఘానికి కావలసిన సంపద ఎవరు సృష్టిస్తారు? సంపదను సృష్టించేవారి దారిద్ర్యం మీదనే సంఘ జీవితమంతా ఆధారపడి ఉండగా ఆ దారిద్రాన్ని తొలగించడంకన్నా సంఘానికి విపత్కరం మరొకటి ఉండదు. యిదేమంత దుర్గ్రాహ్యమైన విషయం కాదు." అన్నాడు.

ఇంతలోనే ఇంకొక గడ్డమాయన లేచి, "అదీకాక అందరిదగ్గిరా సమంగా ఉన్న డబ్బు మృత్తికతో సమానం. అది దారిద్ర్యాన్ని తొలగించదు. వస్తువుల ధరలు మాత్రం ఒకటికీ నూరింతలు పెరుగుతవి అంతే! ఆర్థిక శాస్త్రవేత్తను కనక చెప్పానుగాని సంఘం గతి ఏమైనా చింత లేదు" అన్నాడు.

"మరి నన్నేం చెయ్యమన్నారు?" అన్నాడు శివయ్య దీనంగా.

నువు నీ ధనరాసులు బ్రాహ్మణ్యానికి మాత్రమే పంచు. వారు సంపద సృష్టించరు కనకనూ, వారి డబ్బు కాలక్రమాన సంపద సృష్టించే వారికి చెందుతుంది" అన్నాడు మొదటి గడ్డంవాడు.

"ఒక బ్రాహ్మణ్యానికే కాక పనిపాటలు లేనివారికి, సంస్కృతినే పెంపొందించే వారికి, వ్యాపారం చేసేవారికి, ధనికులకూ కూడా ఈ డబ్బు పంచవచ్చు. అందువల్ల సంఘ వినాశనం జరగదు అని అర్థ శాస్త్రం ఘోషిస్తుంది. ఇందులో నా స్వంతం ఏమీలేదు" అన్నాడు రెండో గడ్డంవాడు.

ఆనాటి అర్థరాత్రి ఎవరో శివయ్య వాకిలి మెల్లగా తట్టారు. ఆర్భాటాలు, హాహాకారాలు, పెడబొబ్బలూ, దివిటీల వెలుగూ స్ఫురించని కారణంచేత శివయ్య బందిపోటు దొంగలని

భయపడక తలుపు తెరిచాడు. తలుపు తెరవగానే ఆయన విస్మయం ఏమని చెప్పాలి. రెండు మూడు వందల మంది బలశాలులు విచ్చుకత్తులతోనూ, గండ్రగొడ్డళ్ళతోనూ, పలుగులతోనూ, దుడ్డుకర్రలతోనూ, బరిశలతోనూ, ఆవరణలో ప్రవేశించారు. శివయ్య ప్రాణం నిలువునా పోయినంతపని అయింది. అయితే ఆయన భయపడ్డట్టు ఆయనమీద తమ ఆయుధాలు ప్రయోగించక, అందరూ వంగి ఆయనకు నమస్కారం పెట్టి "దణ్ణాలు దొరా!" అన్నారు.

"ఏం కావాలి? ఎందుకొచ్చారీ అర్ధరాత్రి?" అన్నాడు శివయ్య.

వాళ్ళలో ఒకడు ముందుకు వచ్చి దొరవారు దేవేంద్రులు, మేం ఏలినవారి బానిసలం. ఈ బ్రాహ్మలంతా చేరి తమ సొత్తంతా కాజెయ్య చూస్తున్నారు. తమ సంపద చూడలేక కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారు. తమరు ధర్మదాతలు గనక, అడగనివాడిది పాపంగా, డబ్బు పారేస్తున్నారు. కాని ఈ పని ఎవరూ చేయరు. తమ దగ్గర డబ్బుంటే సంఘానికి ముప్పన్నది వొట్టి అబద్ధం. రాజుగారి బొక్కసంనిండా డబ్బున్నది. రాజుగారు చల్లగా ఏలబట్టే ప్రజలు బ్రతుకుతున్నారు. మీరైనా ఆపనే చేస్తే మంచిది. మిమ్మల్ని కాపాడ డానికి మేమున్నాం. మీరేది చెబితే అది చేస్తాం. మీరు ధర్మం ఎరిగినవారు ధర్మాన్ని నిలబెట్టి అధర్మాన్ని పోగొట్టండి. అశిష్టంగాని అధర్మాన్ని ప్రోత్సహించకండి. మీరు తపస్సు ధారపోసినడబ్బు అందరికి పంచటం అధర్మం. మీరు రాజుకన్నకూడా బాగా దుష్టశిక్షణా శిష్టరక్షణా చేయండి. మేం ఆశాపాతులంకాం. మా సేవనుబట్టి మీరు ఈనాము లిప్పించండి!" అన్నారు.

బ్రాహ్మడికి ఈ మాటలు నచ్చాయి. ఈ బలగం సహాయంతో ధర్మ పరిపాలన సాగించటానికి బ్రాహ్మడు నిశ్చయించినాడు.

మర్నాడు గ్రామ పెద్దలు శివయ్య దగ్గరికి వచ్చారు. శివయ్య తన డబ్బు తన దగ్గరే ఉంటున్నదనీ, దానిని ఎవరికి పంచబోవటం లేదని చెప్పాడు.

"నిన్న సభలో చేసిన ప్రసంగాలన్నీ ఏమయాయి!" అన్నాడు ఆర్థికవేత్త కోపంగా.

"అవి వ్యర్థంకాలేదు. నేను సంతర్పణలూ అవీ మానేస్తున్నాను. నా డబ్బు అనవ సరంగా ఎవరికీ చిల్లిపిగాణీ ఇవ్వను. దాన్ని కోరేవారు నేను చెప్పినట్టు సంఘానికి సేవ చేయాలి." అన్నాడు శివయ్య.

"అట్లా అయితే తమ ధనరాసులవల్ల సంఘానికి కించిత్తయినా అపాయంలేదు అని ఆర్థిక శాస్త్రం ఎలుగెత్తి చెబుతోంది. ఇందులో నా స్వంతం ఏమీలేదు." అన్నాడు గర్జించాడు.

"నువు నాకు ఆర్థిక మంత్రిగా ఉంటావా!" అన్నాడు శివయ్య.

"దానికి ఆర్థిక శాస్త్రం ఏమీ అభ్యంతరం చెప్పదు. ఆర్థికశాస్త్రరీత్యా ఆర్థిక మంత్రికి నెలకు రెండువేల వరహాలవేతనమూ ఇతర వ్యాపారాది సౌకర్యాలూ చూపవలసి ఉంటుంది."

మిగిలిన పెద్దలు కోపంతో వెళ్ళిపోయి చెట్టుకింద సభచేశారు. వారిలో రెండు

పక్షాలయాయి.

"శివయ్యచేత ధర్మపరిపాలన సాగింతాం, మన బ్రాహ్మణ్యానికి ఏమీ లోపం ఉండదు." అన్నారు ఒక పక్షం.

"మనని ఏ క్షత్రియుడుగాని, అధమం దాసీపుత్రుడుగాని ఏలితే ఒప్పుకుంటాంగాని ఈ శివయ్యా మనని ఏలేవాడు!" అని పృచ్ఛించారు రెండో పక్షం.

మొదటి పక్షంవారు నేరుగా శివయ్య దగ్గరకి తిరిగి వచ్చి రకరకాల మంత్రిపదవులు స్వీకరించారు.

రెండో పక్షంవారు కొందరు నాయకులను ఎన్నుకున్నారు. ఆ నాయకులు నేరుగా సూరామడ దూరంలో ఉన్న రాజు దగ్గిరికి వెళ్ళి "అయ్యా, మహాప్రభో! మా ప్రాంతంలో మరొక ప్రభుత్వం, అధర్మ ప్రభుత్వం—సాగింది. తమరు తమ సైన్యాలతో వచ్చి మా రాజ్యం మీద యుద్ధం చేసి చోరులూ, హంతకులూ అండగా పెట్టుకుని పరిపాలన సాగించే మా అధర్మ ప్రభువును నాశనంచేసి ధర్మప్రభువులు ధర్మచ్యుతి కాకుండా చూడాలి!" అన్నారు.

"కులాలకుజై" "వర్ణాశ్రమ ధర్మాలు" "వర్ధిల్లాలి!" అని మిన్ను ముట్టేటట్టు నినాదాలు చేశారు.

రాజుగారి దగ్గరకూడా హంతకులూ చోరులూ ఉన్నారు. వాళ్ళతో రాజుగారికి పని వుంది. అయితే ఈ మాట ఈ పంచమాంగదళ నాయకులకు చెప్పటం దేనికి? రాజుగారు చెప్పలేదు.

రాజుగారు రాయబారులకు నగలూ నాణ్యాలూ, ఇచ్చి, భోజనం పెట్టించి, తన దాసీలను వారి పరిచర్యకు నియోగించి యుద్ధానంతరం వారికి స్థానిక పరిపాలకోద్యోగాలు వాగ్దానం చేసి, యుద్ధానికి ఆయత్తం అయినాడు.

మరో ఆరునెల్లకు ఈ యుద్ధం జరిగింది. యుద్ధంలో రాజుగారు చిత్తుగా ఓడిపోయినాడు. ఆయన బలాలు శివయ్య బలాలకు వెన్నిచ్చి వాయువేగ మనోవేగాలతో పలాయనం చేశాయి. పంచమాంగదళ నాయకులు పదిమంది పట్టుబడ్డారు. వారికి యుద్ధనేర విచారణ స్థానంవారు ఉరిశిక్ష విధించారు. విచారణ శివయ్య అధ్యక్షత కిందే జరిగింది. శిక్షలు ఆయనే స్వయంగా చెప్పాడు మర్నాడు. యుద్ధ నేరస్థుల శిరచ్ఛేదం జరిగింది.

ఇది జరిగిన రాత్రే శివయ్య తన మంత్రివర్గంతో మేడ మీద రహస్య సభలు జరిపి "ఈ యుద్ధం అసలు ఎందుకు జరపవలసి వచ్చింది?" అన్నాడు.

"మన ప్రతిపక్షంవారు మనకు బ్రాహ్మణ కులాభిమానం లేదని భయపడి శత్రు పక్షంలో చేరారు. నిజానికి బ్రాహ్మణేతరులు మన మీద అభిమానంతో యుద్ధం చేసి ప్రాణాలు అర్పించబట్టే మనం విజయం పొందాం" అన్నాడొక మంత్రి.

అంతవరకు బాగానే వుంది. కాని చీటికి మాటికి ఇటువంటి యుద్ధాలు వస్తే మనం భరించలేం! మనవైఖరి మారాలి. అగ్రవర్ణంవారి సానుభూతితో మనం ఇకముందు పరిపాలన సాగించాలి" అన్నాడు శివయ్య.

"అట్లా చేసినట్టయితే ఈ జరిగిన యుద్ధానికి నీతి వుండదు" అన్నాడొక మంత్రి.

"చరిత్రకెప్పుడూ నీతిలేదు. ఏలినవారి ఇష్టప్రకారం చేయవచ్చు. తిరుగుబాటు శక్తులు అగ్రవర్ణంలో ఉండగా మనం ఇతర వర్గాలవారి అభిమానం దేవులాడి లాభంలేదు. ఇవాళ సాయంకాలం ఉరితీయబడ్డ యుద్ధ నేరస్థులు చేసిన సాహసం ఇతర వర్గాలవారు కలలోకూడా తలపెట్టి వుండరు. వారి మంచితనాన్ని మనం సద్వినియోగ పరచుకోవాలి. అదిగాక పదిమంది బ్రాహ్మలు ఉరితీయబడ్డారనే కోపం కార్చిచ్చులాగ బ్రాహ్మణ వర్ణంలో వ్యాపిస్తోంది. మనం జాగ్రత్తపడాలి."

శివయ్య కొత్త పాలసీని గురించి రహస్యప్రణాళిక తయారు చేయించి అమలు జరిపాడు. కాని యీ విషయం ఇతరవర్గాలవారికి క్రమంగా తెలిసింది. ఏ బ్రాహ్మణ యుద్ధానికి దారి తీశారో వారికిప్పుడు పరిపాలనలో మంచి సౌకర్యాలు కలగటమూ, రక్తంధారపోసి విజయం సాధించిన మిగతా కులాలవారి జీవితం నానాటికి క్షీణిస్తూ జీవితం దుర్భరం అవుతూండటమూ ప్రజలకు తెలిసిరాసాగింది. ఈ ఉద్యమం మొదట కులతత్వం మీదనే సాగింది.

"కులతత్వాలు నాశనం చేయటానికి దేశం ఘోరమైన యుద్ధానికి గురిఅయి ఎంతో నష్టకష్టాలకు లోనయింది. అందుచేత యీ ప్రభుత్వం ఎటువంటి కులతత్వాలు సహించదు. కులతత్వవాదులు నిర్దాక్షిణ్యంగా శిక్షించబడతారు" అని శివయ్య ప్రకటన చేశాడు. యీ ప్రకటనకు అగ్రవర్ణాలవారు బహుసంతోషించారు. తక్కువ కులాలవారిలో చాలామంది మోసపోయినారు.

కాని సన్నగా ఆరంభమైన ప్రభుత్వం మీద తిరుగుబాటు చీలికలై, కొత్త కొత్త దార్లవెంట అభివృద్ధి సాగింది. ఈ తిరుగుబాటుదార్ల ముఠాలన్నిటిలోకి అతి ప్రమాదకరంగా పరిణమించినది నాస్తికుల ముఠా. చిత్రమేమిటంటే ఈ నాస్తికులముఠా ప్రభుత్వంలాగే కులతత్వాలను నిరసించింది. ఈ ముఠాలో బ్రాహ్మలదగ్గర్నుంచి పంచములదాకా చేరి ఏ కులభేదాలు లేకుండా పనిచేయసాగారు. వీరు కోరినదల్లా దేశసంపదను అన్నికులాలకూ న్యాయంగా పంచాలని కులాలమధ్య దోపిడి జరగరాదని, సంపదను సృష్టించని వారికి సంపదమీద ఏ హక్కు, భుక్తాలూ ఉండరాదని.

ఈ ముఠాకు నానాటికి ప్రజలలో—ముఖ్యంగా హీన జాతులలో—ప్రాబల్యం హెచ్చటం చూస్తే శివయ్యకు విస్మయం కలిగింది. ఈ ముఠానాయకులను ఎందర్నో తల తీయించాడు. మరెందర్నో యావజ్జీవ కారాగారంలో ఉంచాడు. వీరిమీద ఏ ఆరోపణలూ లేకపోతే లేని ఆరోపణలు కూడా చేయించాడు. కాని నాస్తికుల ఉద్యమం ఆగలేదు.

నాస్తికముఠా నాయకులు వీధులు కలిసేచోట నిలబడి, "చరిత్ర చదవండి. ఇవాళ

మనను అణచటానికి చూస్తున్న ఈ శివయ్య ఒకనాడు తన డబ్బంతా ప్రజలందరికీ సమంగా పంచుతానన్న వాడే ! మనం డబ్బు సమంగా పంచమనటం లేదు; న్యాయంగా మాత్రమే పంచమంటున్నాం. వస్తువులు ఉత్పత్తిచేసేవారికి డబ్బుపంచితే ఉత్పత్తి ఎవరు చేస్తారని పెద్దలడిగిన ప్రశ్నకు శివయ్య సమాధానం చెప్పలేకపోయినాడు.

ఆ సమాధానం మేం చెబుతున్నాం ! సంఘానికి ఇతరత్రా సేవచేయలేని ప్రతివాడూ వస్తువులు ఉత్పత్తి చేయవలసిందే, యీ సంఘంలో వస్తువులు ఉత్పత్తిచేయించటం ఒక లాభసాటి వృత్తి అయిపోయింది. ఆ వృత్తి చేసేవారు తరతరాలు కాలుమీద కాలేసుకుని పనీపాటా చేయకుండా జీవిస్తూ తమ బొక్కసాలు నింపుకుంటూ, పెంచుకుంటున్నారు. వస్తువులు ఉత్పత్తి చేసేవారు నానాటికి దరిద్రంపాత పడుతున్నారు. ఇట్లా ఎందుకు జరుగుతున్నదో శివయ్య మనకు చెప్పాలి. ఒకప్పుడు వ్యవసాయం చేసేవారికింద ఉండినభూమి రానురాను పొలాల మొఖం ఎరగనివాళ్ళ హక్కు భుక్తంలోకి ఎందుకు పోతున్నదో, ఒకప్పుడు రైతులుగా ఉన్నవారంతా రానురాను రైతుకూలీలుగా ఎందుకు మారిపోతున్నారో కూడ శివయ్య మనకు చెప్పాలి" అని ఉపన్యాసాలు దంచసాగారు.

నాస్తికుల్ని ఎదిరించటానికి రహస్య ముఠాలు ఏర్పడ్డాయి. వీళ్ళు అర్థరాత్రివేళ వచ్చి రైతుల ఇళ్ళూ, కార్మికుల ఇళ్ళూ, నాస్తికముఠా సభ్యుల ఇళ్ళూ తగలబెట్టి ఘోరహత్యాకాండ సాగించారు. ఈ రహస్య కూటాలమీద శివయ్య యుద్ధం ప్రకటించాడుగాని క్రియకు ఈ యుద్ధం కాగితంమీదే జరిగింది. తమపై ఒత్తిడి హెచ్చుతున్నకొద్ది నాస్తికులు తీవ్రచర్యలు సాగించారు. వారు తీవ్రచర్యలు సాగించినకొద్ది వారిపై శివయ్య మరింత తీవ్రచర్యలు అమలు జరిపాడు. జీవితం దుర్భరమైపోయింది. ప్రజ అల్లాడిపోసాగారు.

"నాస్తికులను చిత్రవధ చెయ్యనందుకు ప్రజలకిదే శిక్ష. ఈ అరాచక పరిస్థితులకు ప్రభుత్వం బాధ్యత ఏమీలేదు. తమ నిజమైన శత్రువులెవరో ప్రజలు తెలుసుకోవాలి. ప్రభుత్వం ఏదన్నా సహిస్తుందిగాని నాస్తికులకు సహించదు" అని శివయ్య ప్రకటించాడు. ఈ ప్రకటన ఏమీ ఫలించదు. ఒక సుముహూర్తంచూసి శివయ్య తన శత్రువైన రాజు దగ్గిరికి ఒక చారుణ్ణి పంపాడు. నాస్తికత్వాన్ని అణచడానికి సమైక్య ప్రయత్నాలు సాగించడానికి ప్రణాళిక తయారయింది. వేలిముద్రలు కూడా మరో నెలలోగా పడిపోతాయి.

శివయ్య పెద్ద ప్రకటన తయారుచేశాడు. అందులో నాస్తికులకు కాలం మూడిందనీ, వారి నిర్మూలనానికి అంతర్జాతీయ సన్నాహాలు ఆరంభయ్యాయనీ ప్రకటించాడు.

ఈ ప్రకటన జరిగిన మర్నాడే శత్రురాజుల బలాలు వచ్చి శివయ్య రాజ్యాన్ని శాంతియుతంగా ఆక్రమించారు. వారు ప్రజలను కొల్లగొట్టి కనపడ్డ స్త్రీలను చెరచసాగారు.

ఇంతకాలానికి శివయ్య రాజ్యంలో ధర్మం నాలుగు కాళ్ళా నడవసాగింది.

ముద్రణ : 1955, దేవుడిచ్చిన వరం కథల సంపుటిలో, దేశికవితామండలి, విజయవాడ.